


# చింకి చొక్కా

-చంద్రశేఖర్

చింపిరి జుత్తు...చీమిడి ముక్కు... ఛీఛీ... ప్రొద్దుటే వీడి దర్శనం తప్పదు రోజూ. తలుపు తీయగానే.. తయార్ ఎదురూగా. దిక్కుమొక్కులేని వెధవ పాపం. ఎక్కడికి పోతాడు? ఆ చెట్టే వాడి నివాసం. ఏ తల్లి కన్నబిడ్డో! ఎందుకు వదిలేసిందో! అలాగే బతుకుతున్నాడు వొంటరిగా. అక్రమంగానో, సక్రమంగానో ఎలాగైతేనేం? భారమైన కుప్పతొట్లో పడేసి ఉంటుంది. లేదా ఎక్కడైనా తప్పిపోయి, ఇలా కొట్టుకొచ్చాడేమో! నా మంచుగడ్డ మనస్సు కరుగుతోంది. రాయి కాదన్నమాట! చెప్పొద్దూ... శుభ్రంగా స్నానం చేయించి, మంచి బట్టలేస్తే దొరబాబులా వుంటాడు వెధవాయి. మంచి పుటక. తీరైన కనుముక్కు. దబ్బపండు రంగు. (తన రంగు చూసుకుంటే ఛీఛీ.. తనకే అసహ్యం. రాక్షసి బొగ్గు రంగు. అందుకేనేమో తన రంగు వాళ్లంతా వాడ్ని అకారణంగా ద్వేషిస్తారు. శత్రువులా చూస్తారు. పాపం వాడి రంగే వాడికి తెలీదేమో!) రోజూ నా ఆలోచనల పాత రికార్డు... అరిగిపోదెప్పుడూ...

ఐనా వీడింత ఎముకలు కొరికే చలిలో వీధిలో చెట్ల కింద ఎలా బతుకుతున్నాడు!? గట్టి పిండం. వంటి మీద నూలుపోగు లేదు. మొలకి ఓ చింకిగోచీ తప్ప. వారం రోజుల క్రితం చిరిగిపోతే పారేసిన, గోతం పట్టలు, ఇల్లు తుడిచే అలుగ్గుడ్డలు కలిపి ఎలా చేసుకున్నాడో, ఓ బొంత చేసుకుని, కప్పుకుంటున్నాడు పాపం. నాకు జాలి, సానుభూతి కల్సి నయాగరా జలపాతంలా ఉరికి కవిత్వం పొంగి పొర్లింది.

ఓ మనసా!

అసహ్యించుకోకు వాణ్ని...

ఆదరించకున్నా... - జలపాతానికి అడ్డుకట్టలా... మా ఆవిడ కాఫీ ఆహ్వానం. వేడివేడి కాఫీ సిప్ చేస్తూ, పేపర్లో హాట్‌హాట్ న్యూస్ చదువుతూ... అన్నీ మర్చిపోయా అప్పటికి.

* * *

భోజనం ముగించి, ఆఫీసుకు తయారై బయటికి రాగానే కళ్లు వాడి కోసం వెతుకుతాయి రోజూ... వాడి ప్లేసు అప్పటికి నాలుగిళ్లవతల చెట్టు కిందికి మారుతుంటుంది. ఎందుకంటే... ఆ ఇంటి యజమాని, (తనలాగా కాక) భోంచేసే ముందు 10 గంటలకల్లా 'కాకి' ముద్దా, బయట గోడ మీద పెడతాడు. దాంతో వాడి బ్రేక్‌ఫాస్ట్ మొదలవుతుంది. వాడికి భయపడో ఏమో ఏ కాకులూ ఆ వీధికి రావు. వాటికి సానుభూతేమో వీడంటే... మానవులకంటే... 'దిక్కులేని పక్షి. తెల్లకాకి, పాపం తిననీ...' అనుకున్నాయేమో! పొరపాటున ఓ కొత్తకాకి వస్తే, వాడు గురిచూసి విసిరిన రాయికి, ఏ కన్నో కాలో దెబ్బతిని, మళ్ళీ ఆ వీధికి రావు. వాడు ఆ వీధి వదిలి వెళ్లడు. ఎందుకంటే.. ఆ వీధిలో చాలా మంది ఉదయం పది గంటలు మొదలు మధ్యాహ్నం రెండింటి వరకు, 'కాకి' ముద్దలు పెడ్తూనే ఉంటారు, గోడల మీద...

మహానుభావులు. (తనకంటే మేలు). పితృదేవతల భక్తులు. ఆ ముద్దలన్నీ... వాడి జానెడు బొజ్జ నింపుతాయి. వాడికి రోజూ... బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్ అన్నీ ఆ 'కాకి' ముద్దలతోనే సరి...

స్నేహితులెవ్వరూ లేరు వాడికి. ఓ చెడు అలవాటు లేదు. పంపు కింద స్నానం. 'కాకి'ముద్దల భోజనం. వంటరి బతుకు. ఇలా సాగిపోతోంది వాడి జీవితం. ఐదేళ్ళవాడు పదేళ్ల వాడయ్యాడు. ఇప్పుడు కాస్త శుభ్రంగా ఉంటున్నాడు. ఐనా వాడి నిత్యకృత్యంలో మార్పు లేదు. రోజూ చూస్తూనే ఉంటా... అనాలోచితంగానో, అలవాటుగానో...

* * *

ఓసారేమైందంటే... మా పక్కింటికి కొత్తగా అద్దెకు దిగిన వారింట్లో ఆయన తల్లిగారి శ్రాద్ధమైతే, దొన్నెల 'కాకి' ముద్ద, మేడపైన పెట్టారు. వాడు ఆ ముద్ద కోసం కాంపౌండ్ వాల్ ఎక్కి, పైకి పాకి వెళ్తుండగా చూసిన ఆ ఇంటాయన, మడిలో వున్నది కూడా మరచి, పట్టుకుని కుళ్ల బొడిచాడు. చేతులతో, కాళ్లతో... (ముందు రోజే వాళ్ళావిడ 15 కాసుల బంగారు గొలుసు పోయిందిట) 'దొంగ వెధవా! నీవే కాజేసి ఉంటావు ఎక్కడ పెట్టావో చెప్పు...' అంటూ... చివరికి చేతులు నొచ్చి, గొడుగు కర్రతో కొట్టాడు. వాళ్లావిడ అడ్డొచ్చి... 'చచ్చిపోతాడండీ! మర్డరు కేసవుతుంది. పోలీసు రిపోర్టిద్దాం. వదిలేయండి. కుర్రవాడు' అని వారించకపోతే... వాడి ప్రాణాలు ఆ రోజే పోయి ఉండేవి. (ఆయన పోలీసు రిపోర్టివ్వలేదు. ఇల్లంతా లంచాల అన్యాయార్జితపు సొత్తేట! ఆ తర్వాత తెల్సింది)

పాపం వళ్లంతా రక్తం చిమ్మి, వాచిపోయి, మూడు రోజులు మూల్గుతూ పడుకున్నా ఎవ్వరూ పట్టించుకోలేదు వాణ్ని. కన్నతల్లే భారమై వదిలేస్తే, ఆ వీధి వెధవ కెవరు దిక్కు? మూడు రోజుల తర్వాత మూల్గుతూ లేచి, వాళ్ల ఇంటి ముందంతా వెతికి, ముందున్న మురికాలువలో ఎండ వెలుక్కి తళతళా మెరుస్తున్న వస్తువును చూసి, వాడు వాళ్ల గేటు తట్టి ఇంటాయన్ని పిలిచాడు. ఈ తతంగమంతా మా హాలు కిటికీలోంచీ చూస్తున్నా. ఆయనొచ్చి, చూసి, వాడినే మురికి కాలువలోంచీ తీయమని, నీరు పోసి, కడిగించి, తీసుకున్నాడు. పోయిందనుకున్న వాళ్లావిడ బంగారుదండ దొరికినందుకు సంతోషించాడు. కానీ పైకి ఒక్క థాంక్స్ కానీ, సారీ లాంటి పదం గానీ చెప్పలేదు. రక్తం కారేలా కొట్టినందుకైనా, సానుభూతి లేదు. పాపభీతి లేదు. వాడు చేస్తున్న సైగలు నాకు అర్థమయ్యాయి. 'నేను దొంగను కాను. 'కాకి ముద్ద కోసం, మేడ ఎక్కబోయానని' చెప్తున్నాడు. ఒక్క రూపాయి ఇవ్వలేదు, వాడికాయన. కొక్కెం వీడిపోయి, దండ జారిపడిపోయిందని ఆవిడ, మా ఆవిడతో చెప్పిందట! పాపం! నిజాయితీపరుడే వెధవ నిజాయితీని రుజువు చేసుకున్నాడు కూడా. గొప్ప గుణం గల రక్తం పిచ్చి వెధవది.

మనసొప్పుకోదు కానీ, పిల్లల్లేని ఆ 108 ఇంటి వాళ్లు, పెంచుకోవచ్చు వీడ్ని. ఐనా కులం గోత్రం తెలీని వీడ్ని ఎవరు పెంచుకుంటారు? వీధిలో అడుక్కు తినేవీడ్ని (నిజానికి వీడు అడుక్కోడం ఇన్నేళ్లలో నేనెప్పుడూ

స్నేహితులెవ్వరూ లేరు వాడికి. ఓ చెడు అలవాటు లేదు. పంపు కింద స్నానం. 'కాకి'ముద్దల భోజనం. వంటరి బతుకు. ఇలా సాగిపోతోంది వాడి జీవితం. ఐదేళ్ళవాడు పదేళ్ల వాడయ్యాడు. ఇప్పుడు కాస్త శుభ్రంగా ఉంటున్నాడు. ఐనా వాడి నిత్యకృత్యంలో మార్పు లేదు. రోజూ చూస్తూనే ఉంటా... అనాలోచితంగానో, అలవాటుగానో...

చూడలేదు. 'కాకి' ముద్దలు తినడం తప్పు) ఎంగిలాకుల విందు భోజనాల వాణ్ని, (పొదుపు పెరిగి ఆకుల్లో భోజనాలు ఏనాడో పోయాయి. ప్లేట్లలో తిని, మిగిలింది, డస్ట్‌బిన్‌లోకి, ఆపై మున్సిపాలిటీ బండిలోకి, ఊరి చివరి మురికికుప్పల్లోకి; ఆకుల్లో తిని పారేస్తే, కుక్కలో, వీధి కుర్రాళ్లో తినే రోజులు పోయాయి మరి) ఎవరు పెంచుకుంటారు వీడ్ని. తాను పెంచుకోగలడా నిజానికి? తనకూ పిల్లల్లేరుగా. ఆశ ఇంకా చావలేదనుకోండి. అది వేరే సంగతి. వాడు నోరెత్తి ఏనాడూ మాట్లాడడు. చేయి చాచి ఎవర్నీ ఏమీ అడగడు. నోరున్న మూగజీవి. మనుషుల మధ్య ఏకాకి.

ఆ 85 ఇంటి పండు ముసలి వారు వీడికింత అన్నం పెట్టి, వాకిట్లో వుంచుకున్నా... వారికి సర్వ సపర్యలు చేస్తాడు... నిజాయితీగా. కానీ ఆ వీధి కుర్రాడ్నెవరు నమ్ముతారు? కన్నబిడ్డల్నే నమ్మలేని రోజులు కదా? అంతా మహా నిజాయితీ పరులైనట్లు. పోనీ ఆ 15 ఇంటి వాళ్లు, వీడికి వారి పిల్లల పాతబట్టలిచ్చి, వాళ్ల పిల్లల్ని బస్టాప్‌లో దింపేందుకు పనిలో పెట్టుకోకూడదూ? నిలకడగా వుండి పని చేస్తాడే! నెలకో పనిమనిషి మారుతూనే ఉంది మరి. అంతదాకా ఎందుకు? తను తన ఇంట్లో వుంచుకుంటే ఇంటి పని, తోట పని... అన్నీ చేయడూ? తీరినప్పుడు చదువు కూడా నేర్పించవచ్చు. అబ్బో! తన భార్య రంప రాకాసి. లంకిణి! పిసినారి పీనుగ?! ఒప్పుకోదు. తనూ వాడిలా మూగజీవే ఇంట్లో. ఏంటో... ఈ రోజు వీడ్ని గురించీ... ఎందుకింత తెగని ఆలోచనలు (అసమర్థుడ్ని కనకేనేమో?) ఎవ్వరికీ కాని, అందరివాడనా! ఎవరింటికి దారి అడిగినా... చూపిస్తుంటాడు. అందరి పేర్లు, సమాచారాలు తెల్సు వీడికి. ఎవరి వస్తువులైనా పొరపాటున జారిపడిపోతే తెచ్చి ఇస్తుంటాడు. థాంక్ లెస్ జాబ్!

అంతెందుకు? మొన్నటికి మొన్న తాను ఆటోలో నెల సరుకులు తెచ్చి, ఆటో వాడికి డబ్బిచ్చి వెళ్ళిపోతే, పర్సులోంచీ జారిపడిన 500 రూపాయల నోటు, గేటు తట్టి మరీ ఇచ్చిపోయాడే... తాను బక్షీసుగా, ఓ రూపాయిగానీ, ఓ అన్నం ముద్దగానీ, ఆఫర్ చేశాడూ? ఇతరులు చేయలేదని అనడం తప్ప, తానేం చేశాడూ? చేయగలడు? మనస్సులో మహా జాలిపడటం తప్ప. కరుణ, దయ, ఏరులై తన మనస్సులో గంగా, యమునల్లా, వరద ప్రవాహం చేస్తున్నాయో! అందుకే అన్నాడో సినీ కవి... 'ఎదుటి వారికీ చెప్పేటందుకె నీతులు ఉన్నాయీ...' అని, ఎంత పచ్చి నిజం! 'చెప్పుట సులభంబు, చేయుట కష్టంబు...'

⁂

ఆ రోజు ఆఫీసు నుండీ వచ్చాక చూశా... వాడి వంటి మీద కొత్త చొక్కా, నిక్కరు. ఎవరికబ్బా! ఇంత త్యాగ బుద్ధి పుట్టింది? ఆకాశం నీలిరంగు మీద తెల్లటి నక్షత్రాలు, పింక్ కలర్ నిక్కర్. వాడు ఆ చొక్కా, నిక్కరులో చుక్కల్లో చంద్రునిలా వెళ్లిపోతున్నాడు వెధవాయి. అన్నేళ్లగ్గాను, మర్నాడు ఆఫీసుకు వెళ్ళబోతూ... ఆసక్తిని చంపుకోలేక 'కొత్త చొక్కా ఎక్కడిదీ?' అని అడిగా రహస్యంగా. వాడు వంగివంగి నమస్కారం చేసి, 'ఆ 18 ఇంటి వారి మనవడు ఇచ్చాడు' అని చెప్పాడు. ఆ రాత్రికి మా ఆవిడ అందించిన సమాచారం... 'అమెరికా నుండి, ఆ 18 ఇంటి వారబ్బాయి, మనవడు వచ్చారట! చొక్కా లేకుండా తిరుగుతున్న వీడ్ని పిలిచి, తన కొత్త చొక్కా, నిక్కరు ఇచ్చి, సబ్బు, టవలు, దువ్వెన, తలనూనె, పౌడర్ డబ్బా, అన్నీ ఇచ్చి స్నానం చేసి, రెడీ ఐ రమ్మని, వాడితో ఫొటో కూడా దిగాట్ట. ఫొటో కాపీ కూడా వాడికొకటి ఇచ్చాట్ట. స్వీట్లు పెట్టాట్ట. (వాడి జీవితంలో అదే ఐ ఉంటుంది స్వీట్లు తినటం) ఆ ఫొటోనే కాబోలు వాడు ఉదయం, మహా ఆనందంగా చూసుకుంటూ పొంగి పోతున్నాడు! పిచ్చి వెధవ.

పాపం అమెరికా పౌరుడైన ఆ భారతీయ బిడ్డడు, భారతీయ సంస్కృతి, రక్తంలో ప్రవహిస్తుండగా... చొక్కాలేని వీధి కుర్రాడి మీద చూపించిన ప్రేమ... దుక్కముక్కల్లా వుండి, వేలు, లక్షలు నెలకు ఆర్జిస్తూ, భారతదేశపు గాలి పీలుస్తూ, నీరు తాగుతున్న తమలో ఏ ఒక్కరికీ, చివరికి, ఇన్ని కబుర్లు చెప్పే తనకూ... లేకపోయింది గదా?... అనే ఆలోచనల్తో ఆ రాత్రి నిద్రే పట్టలేదు.



మొన్నటికి మొన్న తాను ఆటోలో నెల సరుకులు తెచ్చి, ఆటో వాడికి డబ్బిచ్చి వెళ్ళిపోతే, పర్సులోంచీ జారిపడిన 500 రూపాయల నోటు, గేటు తట్టి మరీ ఇచ్చిపోయాడే... తాను బక్షీసుగా, ఓ రూపాయిగానీ, ఓ అన్నం ముద్దగానీ, ఆఫర్ చేశాడూ? ఇతరులు చేయలేదని అనడం తప్ప, తానేం చేశాడూ? చేయగలడు?

⁂

కాలం ఎవ్వరి కోసం ఆగదుగా! చక్రం తిరిగిపోతూనే వుంది. వాడ్ని అప్పుడప్పుడూ గమనిస్తున్నా, ఆఫీసు పని వత్తిడిలో, క్యాంపులు, ఇన్‌స్పెక్షన్లు, ప్రమోషన్లు, ఫంక్షన్లు, వీటిలో పడి, వాడ్ని గురించీ ఆలోచించే తీరికే లేక పోయింది. ఆలోచించి చేయగలిగేదీ తనలాంటి పిరికివాడికి, భార్యా విధేయుడికి, అసమర్థుడికీ, ఏమీ ఉండదు. ఆడవాళ్లు జాలి గలవాళ్లు అంటారే. అమ్మల మనసు కరిగిపోతుంది అంటారే. ఆ వీధి ఆడవాళ్ల కెవరికీ ఆ మనస్సు, జాలి లేవేమో... తన భార్యలా...

చలికాలం పోయి వేసవి ప్రవేశించింది. ఎంతో కాలానికిగాను, ఆ రోజు తీరిగ్గా బయటి పూలతోటలో తిరుగుతూ... వాడ్ని చూశాను. చొక్కా బాగా చిరిగింది. మాసింది. రంగు వెలిసింది. ఎన్నాళ్లు వస్తుంది ఒక్క చొక్కా? (మళ్లీ ఆ 18 ఇంటివారి మనవడు, అమెరికా నుండి రావాలి. ఇంకో చొక్కా వాడికి రావాలంటే...) ఐనా వాడు ఆ చొక్కాను వదల్లేదు. వేసుకుంటూనే ఉన్నాడు.

నాలో ఆలోచన ఫ్లాష్‌లా వచ్చింది. వీడ్ని తీసుకెళ్లి ఆఫీసులో కాఫీలందించే బాయ్‌గా పెట్టుకుంటే? వీడి జీవితం బాగుపడిపోదూ... అందరూ తలో చొక్కా ఇచ్చినా, శుభ్రంగా ఉండి, నిజాయితీగా పని చేసుకుంటాడు. ఆలోచనలకూ, ఆచరణలకూ బహుదూరం. అనుకున్నానేగానీ... చేయలేకపోయాను వెంటనే.

వెధవ... ఎవ్వరూ మాట్లాడకపోయినా, పలుకరించక పోయినా, ఈ వీధి వదలడు. వీడికేం అవినాభావ, జన్మ జన్మల బంధమో! ఏమో? వీధికంతా అన్‌పెయిడ్ గార్డులా, అన్‌పాయింటెడ్ వాచ్‌మెన్‌లా ఉంటాడు. కొత్త వాళ్లు వీధిలోకి వస్తే, వారి వెనకే వెళ్లి, ఎందుకు, ఎవరి కోసం వచ్చిందీ, తెల్సుకుని కాని వదలడు. ఆ వీధిలో పనిచేసే ఏ పనిమనుషుల్తోనూ కూడా మాట్లాడడు తనకై తానుగా. వీడు వీధిలో వున్నాడంటే ఎవ్వరికీ భయం ఉండదు. ఐనా ఒక్కరూ వాణ్ని దగ్గరకు తీయరు. వారి పిల్లల్నీ పలుకనివ్వరు. ఆ చింకిచొక్కా, చిరుగుల నిక్కరు, చింపిరి జుట్టు, చురుకైన కళ్లు, వెధవకి ఎంత మంచి రింగుల జుట్టో! (వాడ్ని చూసినప్పుడల్లా... నా బట్టతల నిమురుకుంటా) వాడి కళ్లల్లో ఎంత కాంతి! ఎంత నిజాయితీ! ఏ తల్లి కన్నదో? ఆ విశాల నేత్రాల్లో ఎంత ధైర్యం! పాపం మానవ మృగాల మధ్య ఏకాకి జీవితం! తనూ ఓ మానవ మృగమే! వాడితో ఓ మంచి మాట మాట్లాడి, ఒక్క ఓదార్పు పదం చెప్పి, వాడికో మంచి దారి చూపి... ప్చ్. ఉత్తిత్తి వ్యర్థపు ఆలోచనలు తప్ప... తనవైపే తన చేతుల్లో లేదు (తన వైఫ్ చేతుల్లో ఉంది) వాడి లైఫేం బాగు చేయగలడు తను. ఉత్తి అసమర్థుడు.

⁂

సెలవు రోజున భార్యామణి కోరికపై పొద్దుటే పిక్నిక్ వెళ్లి, సాయంకాలం ఇల్లు చేరాం. వీధికి ఆ చివర్న జనం మూగి వుంటే, ఏమైందా అనుకున్నా. కాకుల గోల. కావుకావు శబ్దంతో వీధంతా చాలా డిస్టర్బ్‌డ్‌గా ఉంది. తమ జాతి కాకేమైనా, చచ్చిందేమో! సానుభూతికో, ఏడ్పుకో, అరుపులతో తమ జాతిని పిల్చుకుంటున్నాయి కాబోలు! అనుకుంటూ బయల్దేరా. 'యాక్సిడెంట్' అనే మాటలు దూరానికే విన్పించాయి. 'ఎవరు? ఎలా? ఎప్పుడు?' (జెమిని టీవీ - న్యూస్‌లోలా) ప్రశ్నలు, ఆలోచనలతో వేగం పెంచాను.

'తల పగిలి పచ్చడైంది. ఏ కారో, ట్రక్కో తొక్కేసింది. ఆ మధ్యాహ్నపు, నిశ్శబ్ద సమయంలో, ఎండలో శరీరాన్ని కుక్కలు కమ్మగా విందు భోజనం చేశాయి. అందిన భాగాన్ని అందినట్లు పీక్కుపోయి దూరదూరంగా పీకి పీకి తినేశాయి. ఆ హృదయ విదారక దృశ్యం చూసి, కడుపు దేవేసింది. అందరూ దూరం నుంచీ చూస్తున్నారు. ఎవరో తెలీలేదు. ఒక్క కాలుకాని, చేయి కానీ ఏమీ మిగిలి లేవు గుర్తించను.

నా కళ్ళు మెరిశాయి ఓ క్షణం. ఓ పక్క 'నీలంరంగు చుక్కల చొక్కాముక్క!...' కన్పించింది. వాడు మెడలో ఎప్పుడూ వేసుకునే 'వీరాంజనేయ స్వామి' రూపున్న నల్లతాడు మరో పక్కన పడి ఉంది.

'వీడు వాడే...!' నా నోటి నుండి పెద్దగా వచ్చిన మాటలకు అంతా నావైపు, నా చేయి చూపిస్తున్న, ఆ 'చింకి చొక్కా' ముక్కవైపు మార్చిమార్చి చూశారు... 'అవును వాడే!'

'చింకి చొక్కావాడు!'

'కాకి'ముద్దలవాడు'

'వీధి కుర్రాడు'

'మనవీధి అన్‌పెయిడ్ గార్డు'

'అనాపెయింటెడ్ వాచ్‌మెన్...'

'మా ఇంట్లో పెట్టుకుందామనుకున్నాం.'

'మా బంధువులు పెంచుకుందామనుకున్నారు'

'మా ఆఫీసులో స్వీపర్‌గా పెట్టుకుందామనుకున్నా'

'దుర్మార్గులెవరో గుద్దేసిపోయారు...'

'దయలేదు' 'జాలిలేదు' 'వెధవలు' 'పాపం...' 'ప్చ్'

'మనుషులు కాదు... మానవ మృగాలు...' ఛీఛీ'

★


<u>రచయిత చిరునామా:</u>

చంద్రశేఖర్

కేరాఫ్ శర్వాణి, విల్లా నెం.22

ప్రైడ్ ఆర్కిడ్, వర్తూర్ ఎయిర్‌పోర్ట్ రోడ్

తూబర్‌హళ్ళి, బెంగళూర్- 67. కర్ణాటక